# అధ్యాపకుల పదోన్నతులకు ఇంటర్వ్యూలు నేటి నుంచి

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ అధ్యాపకుల పదోన్నతులకు మంగళవారం నుంచి వర్సిటీలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్‌లో(సీఏఎస్) భాగంగా ఈ ఇంటర్వ్యూలు మూడురోజుల పాటు ఈ నెల 18 వరకు జరగనున్నాయి. కళాశాల వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 42 మందిని అధికారులు ఇంటర్వ్యూ చేయనున్నారు. వీరిలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ఉన్నవారు అసోసియేట్ ప్రొఫెసర్లుగా, అసోసియేట్ ప్రొఫెసర్లుగా ఉన్నవారు ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందేందుకు ఈ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. విభాగాల వారీగా నిర్వహించే ఈ ఇంటర్వ్యూలలో వీసీ డాక్టర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి, రెక్టార్ డాక్టర్ కె.విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావుతో సహా ఇద్దరు నిపుణులు, సబ్జెక్టుల వారీగా బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్లు అధ్యాపకులను ఇంటర్వ్యూ చేస్తారని అధికారులు వివరించారు.

# బేస్‌బాల్ పురుషుల జట్టు ఎంపిక



బాలానగర్: జేఎన్‌టీయూ యూనివర్సిటీలో ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బేస్ బాల్ పురుషుల జట్టును ఎంపిక చేశారు. సెక్రటరీ స్పోర్ట్ కౌన్సిల్ ప్రొఫెసర్ ఎన్.ఎస్. దిలీప్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నల్లగొండ అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. చీఫ్ సెలక్టర్‌గా శ్యాంకుమార్ వ్యవహరించారు. ఎంపికైన క్రీడాకారులు జనవరి 2 నుంచి 6 వరకు పూణేలోని సావిత్రీబాయి పూలే యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనను న్నట్లు ప్రొఫెసర్ ఎన్ఎస్ దిలీప్ తెలిపారు. కార్యక్రమంలో సీఎంఆర్ కాలేజ్, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ తోట మోహన్‌రావు, వివిధ కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# వచ్చే నెల తొలివారంలో సెట్స్ షెడ్యూల్

- ఉమ్మడి ప్రవేశపరీక్షల షెడ్యూళ్లు ఖరారు చేయనున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి
- సెట్స్ కన్వీనర్ల ఎంపిక కోసం అన్ని యూనివర్సిటీలకు లేఖలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఉమ్మడి ప్రవేశపరీక్ష (టీజీ ఈఏపీసెట్-2026) తేదీలను వచ్చే ఏడాది జనవరి తొలి వారంలో విడుదల చేసేందుకు ఉన్నత విద్యామండలి కసరత్తు ప్రారంభించింది. ఈఏపీసెట్‌తో పాటు పాలిసెట్, ఈ-సెట్, ఐసెట్, ఎడ్‌సెట్, లాసెట్ మొదలైన సెట్స్ తేదీలను కూడా ఖరారు చేయనుంది. ఇప్పటికే సాంకేతిక అంశాలపై సమీక్ష చేపట్టింది. జాతీయ పోటీ పరీక్షలు, రాష్ట్ర స్థాయి పరీక్షల తేదీల్లో ఈ ప్రవేశపరీక్షలు లేకుండా నిర్వహించేందుకు వీలుగా అందుబాటులో ఉన్న తేదీలను పరిశీలిస్తోంది. ముఖ్యంగా ఇంటర్ పరీక్షల తేదీలను పరిగణనలోకి తీసుకోవడం కోసం బోర్డుతో సమన్వయం చేసుకుంటోంది. అలాగే షెడ్యూల్‌కు, ప్రవేశపరీక్షకు మధ్య 40 రోజుల కాలవ్యవధి ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటోంది.

**ఏ వర్సిటీకి ఏ సెట్?**

ఉమ్మడి ప్రవేశపరీక్షల నిర్వహణకు వీలుగా సెట్ కన్వీనర్లను ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఏటా ఒక్కో యూనివర్సిటీకి ఒక్కో సెట్ నిర్వహణ అప్పగిస్తున్నారు. ఈఏపీసెట్‌ను సాధారణంగా జేఎన్‌టీయూహెచ్‌కు ఇస్తుండగా మిగతా సెట్లను ఓయూ సహా మిగతా వర్సిటీలకు ఇస్తున్నారు. దీనికోసం ఉన్నత విద్యామండలి అన్ని వర్సిటీలకు లేఖలు రాసింది. దీనిపై త్వరలో సమావేశం నిర్వహిస్తామ ని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి మీడియాకు తెలిపారు. జనవరి తొలి వారంలో సెట్ షెడ్యూల్ విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. సెట్ కన్వీనర్ల ఎంపిక కోసం ప్రతి యూనివర్సిటీ ఉన్నత విద్యామండలికి పేర్లు పంపాల్సి ఉంటుంది. అంతిమంగా ముఖ్యమంత్రితో సమావేశమైన తర్వాత సెట్ కన్వీనర్లను ఖరారు చేసే వీలుందని అధికార వర్గాలు తెలిపాయి.

**కన్వీనర్ల కోసం పోటాపోటీ**

ఉమ్మడి ప్రవేశపరీక్షల నిర్వహణకు కన్వీనర్ల ఎంపిక కోసం ఉన్నత విద్యామండలికి భారీగా సిఫార్సులు వస్తున్నాయి. ఈఏపీసెట్ కోసం జేఎన్‌టీయూహెచ్ ముఖ్య అధికారి తన అనుచరుడైన ప్రొఫెసర్ పేరును ప్రతిపాదించడం మండలి వర్గాలను కంగారు పెడుతోంది. ఎలాంటి అనుభవం లేకపోవడం, అవినీతి ఆరోపణలు ఉండటంతో ఆయన పేరును జాబితాలో చేర్చేందుకు విద్యామండలి అధికారులు భయపడుతున్నారు. మరోవైపు పాలిసెట్‌కు కన్వీనర్‌గా తాము సూచించిన వారికి అవకాశం ఇవ్వాలంటూ ఇద్దరు మంత్రులు రెండు పేర్లను ప్రతిపాదిస్తున్నారు. అలాగే ఏదైనా ఒక ఉమ్మడి ప్రవేశపరీక్ష నిర్వహణ బాధ్యత తమకు అప్పగించాలని శాతవాహన యూనివర్సిటీ వీసీ పట్టుబడుతున్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి ఇచ్చే సెట్స్‌కు పాత కన్వీనర్లను మార్చాలని ఆ వర్సిటీ వీసీ ప్రతిపాదిస్తున్నారు. అయితే వీసీ కొన్ని పేర్లు ప్రతిపాదిస్తుంటే ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మరికొన్ని పేర్లు వస్తున్నాయి. అనుభవం, పారదర్శకంగా వ్యవహరించే వారికే సెట్స్ నిర్వహణ బాధ్యతలు ఇవ్వడం మంచిదని మండలి వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రికి వివరించేందుకు సిద్ధమవుతున్నాయి.